# 3

# దేవుడు నింద భరించవలెనా?

## (యోబు 13; 14; 16; 17; 19; 21)

తన యింటి వాకిట ఒక వృద్ధ స్త్రీ చక్రాల కుర్చీలో కూర్చొనియుండగా, ఇంటింటికి తిరుగుతున్న ఒక యువకుడు ఆమె వద్దకు వెళ్లాడు. అతని కాలేజీ ఖర్చుల నిమిత్తము అతడు బైబిల్లను అమ్మకం చేస్తున్నట్టు ఆమె గ్రహించినప్పుడు, ఆమె దేవుని శపించి, తుపుక్కున ఊసి, దేవుని ముఖాన తనకు ఉమ్మివేయాలనిపిస్తున్నట్టు చెప్పింది.

తన జీవితం నాశనమైనదని ఆమె దేవుని నిందించింది. ఆమె యౌవనంలో ఉండగా కాబోయే భర్తతోనూ కారులో పోతూ ఉండగా కారు రైలు పట్టాల మీదకు వచ్చి ఆగిపోయింది. అంతలో రైలు బండి వచ్చి కారును గుద్దింది. ఆ యాక్సిడెంట్‌లో ఆమెకు కాబోయే భర్త, మరొక జంట అక్కడికక్కడే చచ్చిపోయారు. ఆమెకు మాత్రం నడుమునుండి క్రిందివరకు చచ్చుపడింది. అప్పటినుండి ఆమె చక్రాల కుర్చీకి పరిమితం అయింది. దేవుడు తనకు అన్యాయం చేసినట్టు భావించి అంతకంతకు ఎక్కువగా ఆయనపై ద్వేషం పెంచుకుంది. అనుదినం తాను చనిపోవాలనుకునేది. తన్ను ఎందుకు జీవించడానికి ఆయన విడిచిపెట్టాడో అర్థం కాని స్థితిలో యోబులా ఆమె ఉండిపోయింది. దేవునికి కనికరం కనుక ఉంటే ఇతరులతో పాటు తనను చంపివేయవలసిందని అనుకుంది. ఇతరులకంటె తాను ఎందుకు ఎక్కువగా శిక్షింపబడాలని ఆమెకు అనుమానం కలిగింది.

ఈ స్త్రీ అనుభవించిన శ్రమవంటిదాన్ని అర్థం చేసికొనడానికి యోబు యొక్క అనుభవం మనకు సహాయం చేస్తుంది. తన సమస్య గుండా ఆలోచించడానికి 13వ అధ్యాయంలో యోబు సతమతమౌతున్నట్టు కన్పిస్తుంది. అతని కలతను మనం గ్రహించి అతనియెడల మనం కనికరపడవచ్చు.

### దేవుని ఎదుట యోబు వ్యాజ్యము

యోబు స్నేహితులు అతనికి సహాయము చేయలేకపోయారు (12:2; 13:2, 4, 5; 16:2–4; 19:2–5). అతనేదో తప్పు చేసి ఉంటాడని వారన్నారు, అయితే ఆ తప్పు ఏమో వారు చెప్పజాలకపోయారు. మంచినే వారు ఉద్దేశించారు, కాని వారికి గ్రహింపు లేకపోయింది. దేవుని గూర్చి వారికి జ్ఞానమున్నట్టును ఆయనను గూర్చి వారికి అధికంగా తెలిసినట్టును భ్రమపడ్డారు కాని అది నిజం కాదు. ఆయన చూచినట్టు వారు ఈ జీవితాన్ని చూడలేకపోయారు. ఏమి జరుగుతుందో అనేదానికి వారిచ్చినది కేవలం "భూసంబంధమైన" మరణం కంటె ఎక్కువైనది కాదు. గత అనుభవాన్ని గూర్చి మాట్లాడారు, తమ జీవితాల్లో వారు చూచినదానిని గురించి మాట్లాడారు వారు మానవ ఇతిహాసాన్ని

అనుభవంనుండి నేర్చుకోమని అర్థించారు (8:8).

యోబు కూడ తన వ్యక్తిగత జీవితం మీద ఆధారపడవలసివచ్చింది. దుష్టులైన మనుష్యులు వృద్ధినొంది వృద్ధాప్యంవరకు (ముదిమివరకు) జీవించడాన్ని అతడు చూచాడు. వారు చెప్పుకోదగినంత పలుకుబడిగలవారైయున్నట్టును, అనేకమంది పిల్లలచే వారు దీవింపబడినట్టును, అతడు కనుగొన్నాడు. దేవుడు వారిని శిక్షించినట్టు లేదు. వారి పశువులు వృద్ధిచెందుతున్నాయి. వారు తన పిల్లల విషయంలో ఆనందిస్తున్నారు. ఐశ్వర్యంలో వారు తులదూగి అంతలోనే బాధలులేకుండా వారు చచ్చిపోతారు (21:7-13). దుష్టులు దేవుని ఎదిరించడాన్ని కూడ అతడు చూచాడు. వృద్ధినొందినవారు ఆయనను సేవించడంలో ఏ మేలు లేదని తలంచారు. వారు తమ విశ్వాసాన్ని దాపరికం లేకుండ కనుపరచారు (21:14, 15). దీన్ని చూస్తుంటే యోబుకు తికమకగా ఉండిపోయింది.

మానవ చరిత్ర దేవుని మనస్సును తప్పనిసరిగా బయలుపరచనవసరం లేదు. మనలను నడిపించడానికి అనుభవాలు, మనం కనుగొన్నవి మాత్రమే అయినట్టయితే, మనం అంధకారంలోనికి జోగిపోయే గతి మనకు పట్టుతుంది. దేవుని నడిపింపు లేకుండ అనేక జీవితపు పోరాటాలకు జవాబులు మనకు లభించవు. అందువలన యోబు తన వ్యాజ్యాన్ని దేవుని యొద్దకు తీసికొని పోగోరాడు. తన స్నేహితులు తమ మాటలను దేవుని నోట పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారే తప్ప దేవుని వ్యాజ్యాన్ని వారు సరిగా వాదించ ప్రయత్నించినవారు కారు.

## యోబు యొక్క తికమక స్వీయ కనికరం

మానవ జీవితం అల్పమైనదై బాధతో కూడినదైయున్నట్టు యోబు మాట్లాడతాడు (14:1-4). "స్త్రీ కనిన నరుడు కొద్ది దినములవాడై మిక్కిలి బాధనొందును" అని యోబు మెల్లగా దుఃఖించాడు. అందులో న్యాయమున్నట్టు అతడు చూడలేకపోయాడు. భూమిమీద జీవించడానికి దేవుడు నరునికి యింత అల్పకాలము నియమించియు, "ఆయన వానిని విడిచిపెట్టి ఎందుకు కొంత విశ్రాంతి నివ్వకూడదు?" అని అతడు ఆశ్చర్యపోయాడు. ఈ జీవితానంతరం బ్రతుకున్న సంగతి ఈ సమయానికి యోబుకు తెలిసినట్టు లేదు. "పువ్వు వికసించినట్లు వాడు పెరిగి వాడిపోవును నీడ కనబడక పోవునట్లు వాడు నిలువక పారిపోవును" అని అతడన్నాడు (14:2).

ఆ కలతలో యోబు కొట్టివేసిన చెట్టుకు చిగురించడం కనుగొన్నాడు కాని, మరణించిన మానవుడు తిరిగి జీవించడం చూడలేదు. దానికి ఈ లోకానుభవమే నిదర్శనం. మొద్దులు చిగురించడం అతడు చూసాడు కాని చనిపోయిన మనిషి బతకడాన్ని అతడెప్పుడూ చూడలేదు. అతడిలా అన్నాడు,

> అయితే నరులు మరణమై కదల లేక పడియుందురు. నరులు ప్రాణము విడిచిన తరువాత వారేమై పోవుదురు? తటాక జలములు ఎట్లు ఇంకి పోవునో నది నీరు ఎట్లు ఎండి హరించిపోవునో ఆలాగుననే నరులు పండుకొని తిరిగి లేవరు. ఆకాశము గతించిపోవువరకు వారు మేలుకొనరు. ఎవరును వారిని నిద్రలేపజాలరు (14:10-12).

క్రీస్తు పూర్వం వందల సంవత్సరాలకు ముందు యోబు జీవించాడు గనుక నేడు మనకున్నట్టు పునరుత్థానము యొక్క అభయము అతనికి లేదు.

తానున్న పరిస్థితి కంటె మేలైనదేదీ లేకపోతే యోబుకు తిరిగి జీవించడం ఇష్టం లేదు. స్వీయ కనికరమందు అతడు పొర్లాడుతున్నాడు. మనకొరకు మనమట్టి కనికరమును కోరుకొంటున్నప్పుడు, మనం మన స్పష్టతను కోల్పోతాం. ఏదియెలాగున్నా, 14:13 యోబు యొక్క వాంఛను (కోర్కెను) యిలా బయటపెడుతుంది,

> నీవు పాతాళములో నన్ను దాచినయెడల ఎంతో మేలు, నీ కోపము చల్లారువరకు నన్ను చాటున నుంచినయెడల ఎంతో మేలు, నాకు యింతకాలమని నీవు నియమించిన తరువాత నన్ను జ్ఞాపకము చేసికొనవలెనని నేనెంతో కోరుచున్నాను!

మృతుల స్థితిలో – ఏదో ఒక విధంగా తాను షియోలులో–దేవుని కోపము చల్లారువరకు దాగియుండిన మేలనియు – తరువాత ఈ జీవితానికి అతనిని తిరిగి వచ్చునట్టు నియమించిన మేలనియు యోబు కోరుకున్నాడు. అతడు ఈ ప్రశ్న అడుగుతున్నాడు: "మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా?" (14:14). 7 నుండి 12 వచనాలవరకు అతడు సూచించినట్టు, ఈ విషయంలో అతనికి నమ్మిక లేదు. అదే సాధ్యమైనట్టయితే, తన జీవితపు కఠినమైన పరిస్థితులు గతించిపోయేవరకు తాను వెలుపట వేచి యుండ గోరుతున్నాడు.

దేవుడు తనపై బహు కఠినముగా ఉన్నట్టు యోబు భావిస్తున్నాడు (14:16–19). జీవితపు వేదికపై కొన్ని అడుగులు వేయడానికి మాత్రమే దేవుడతనికి సమయమిచ్చి, తన ప్రతి అడుగులోను పొరపాట్లు కనిపెడుతున్నట్టు అతడు తలంచాడు. జలము రాళ్లను అరగదీయునట్లును, దాని ప్రవాహములు భూమియొక్క ధూళిని కొట్టుకొని పోవునట్లును, సంతోషకరమైన జీవితం కొరకైన అతని నిరీక్షణ కొట్టుకొని పోవునట్లు అతడు భావించాడు. తగిన కాలానికి ముందుగానే, దేవుడు అతనికి విరోధముగా ఉండి, వృద్ధునిగా చేస్తున్నట్టు అతడు ఆయనపై నేరం వేశాడు. తన శత్రువుల చేతికి అతని అప్పగించి దేవుడు అతని నలిపేస్తున్నట్టు అతడు తలంచాడు (16:7–14). దేవుడు అతని ద్వేషించినట్టును, అందుకు గల కారణమేమో తానెరుగకుండినట్టును భావించాడు (16:17) దేవుని యెదుట తాను పవిత్రుడైయున్నట్టు తలంచాడు గనుక తన కష్టాలను అర్థం చేసికొనడం అతనికి బహు కష్టమైయుంది.

తన స్నేహితులతోనూ, తన కుటుంబంతోనూ శత్రువులుగా ప్రవర్తించినందుకు (16:1–6, 20: 17:2–5; 19:2–5, 13–19), యోబు తనకు తానే చింతించాడు. పరిస్థితులు కనుక తారుమారై ఉన్నట్టయితే తాను తన స్నేహితులతో వారు తనకు కలిగించిన అనుకూలతను కలిగించేవాడు. అతడు వారితో దానికంటె అధిక విరోధం పూని అంత ధైర్యంగా మాట్లాడకపోయేవాడు. వారిపై తప్పుల తడకలను మోపి తలను విసరకుండా ఉండేవాడే. వారి బాధ ఉపశమనం కలిగించడానికి ఏదో ఒకటి మాట్లాడేవాడు.

అతని స్నేహితులు అతనిని అపహసించారు, అతని సహోదరులు అతనిని విడిచారు, అతని పరిచితులు అతనిని విసర్జించారు; అతని యింటి పనివారే అతనిని పరాయివానిగా

చూచారు. అతని భార్య అతనిని అలక్ష్యం చేసింది. పిల్లలు అతనిని తృణీకరించారు. ఒకప్పుడు తన్ను ప్రేమించిన ప్రతివాదును అతనికి విరోధులుగా మారారు.

యోబు మరణానికే యోచిస్తున్నాడు (17:1, 11-16). తన వేదనలోనుండి తాను కోరుకున్న ఒకే విడుదల సమాధి. బాగుపడే నిరీక్షణ అతనికి బొత్తిగా లేదు. దీనిని ఎలాగో తప్పించుకోవాలనుకుంటున్నాడు. జీవించడానికి హేతువు అతనికి కన్పించలేదు. సమాధియే తాను కోరుకొను ఆశ్రయముగా ఉన్నట్టు యోబు భావించి యిలా అన్నాడు: "నీవు నాకు తండ్రివని గోతితోను నీవు నాకు తల్లివని చెల్లెలవని పురుగుతోను నేను మనవి చేయుచున్నాను, నాకు నిరీక్షణాధారమేది?" (17:14, 15ఎ).

## యోబు దేవునిపై వేయు నింద

మొదట, యోబు దేవుని అవివేకంగా నిందించలేదు: "ఈ సంగతులలో ఏ విషయమందును యోబు ఏ పాపము చేయలేదు, దేవుడు అన్యాయము చేసెనని చెప్పలేదు" (1:22). "మనము దేవుని వలన మేలుననుభవించుదుమా, కీడును మనము అనుభవింప తగదా" అని అతడు తన భార్యతో అన్నాడు (2:10బి). తరువాత, అతడు దేవుడు తనకు విరోధియైనట్టును, ఆయన తన్ను చీల్చివేస్తున్నట్టును తలంచాడు. "ఆయన తన కోపముచేత నా మీద పడి నన్ను చీల్చెను ఆయన నా మీద పండ్లు కొరుకుచుండెను నాకు శత్రువై నామీద తన కన్నులు ఎఱ్ఱచేసెను" అని అతడన్నాడు (16:9).

తన స్థితిని గూర్చి యోబు చెప్పినదంతా నిజమే. అవన్నీ సంభవించేలా దేవుడు అనుమతినిచ్చాడు. దాని వెనుకనున్న ఉద్దేశాన్ని యోబు ఎరుగలేకపోయాడు. అయితే తనకు సంభవించని విషయం ఎందులోను అతడు నిందవేయలేదు. తన పట్ల న్యాయం జరుగలేదని అతడు దేవుని ప్రశ్నించాడేగాని, దేవునియందు తన విశ్వాసం కోల్పోయి నందున కాదు. తాను సంగతి గ్రహించునట్టు వివరాన్ని అతడు కోరుకున్నాడు. తనపై దయను చూపే పరిస్థితిలో, దేవుడు తనకు శత్రువైనట్టు భావించాడు (19:11).

యిర్మీయాకు కూడ ఈలాటి భావనలే కలిగాయి. "యెహోవా, నేను నీతో వాదించు నప్పుడు నీవు నీతిమంతుడువుగా కనబడుదువు; అయినను న్యాయము విధించుటను గూర్చి నేను నీతో మాటలాడుదును. దుష్టులు తమ మార్గములలో వర్ధిల్లనేల? మహా విశ్వాసఘాతుకులు సుఖింపనేల?" (యిర్మీయా 12:1) దేవుని పరిశుద్ధతను ఆయన శక్తిని హబక్కూకు గుర్తించాడు (హబక్కూకు 1:12, 13), అయితే దేవుని జనులకంటె ఎక్కువ దుష్టత్వంగలవారు దేవుని ప్రజలను బాధించునట్లు ఎందుకు అనుమతించాలి అని అతడు తెలిసికొనగోరాడు. వీరు దేవునిమీద నేరం మోపినవారో లేక ఆయనను నిందించినవారో కారు. కాని యింతకు ఏమి జరుగుతుందో వివరించుమని వారు ఆయనను కోరుకున్నారు.

యోబు దేవుని మీద ప్రశ్న వేశాడు కాని ఆయనను అతడు సందేహించలేదు. ఈ రెండింటికి మధ్య వ్యత్యాసముంది. తన్ను ఏమి చేయకోరుకుంటాడో అలా చేయడానికి దేవునికి తనపై అధికారమున్నట్టు యోబు అంగీకరిస్తాడు, అయితే అది ఎందుకో అతడు తెలిసికోగోరతాడు.

అతడు యింకను దేవుని గౌరవిస్తూ, ఆయన ఘనతను కొనియాడాడు. తనకంటె దేవుడు ఎంతో ఘనుడైయున్నట్టు అతడు గుర్తించాడు (9:1–12; 10:4–12). 13:20, 21లో అతడు దేవునికి రెండు మనవులు చేసికొన్నాడు: (1) తన మీదినుండి దేవుడు తన చేతిని తీసివేయుమనియు (2) తన ప్రసన్నతతో దేవుడు తన్ను భయపెట్ట వద్దనియు అతడు కోరాడు.

దేవుని యెదుట యోబు తన ఫిర్యాదును చేసికోగోరాడు. తాను అలా ఎందుకు బాధింపబడుతున్నాడో అతడు తెలిసికోగోరాడు (13:18). తన రక్షణ యింకను దేవునియందున్నదని అతడు నమ్మికయుంచాడు (13:16).

యోబు తీవ్రంగా బాధపడునట్లు దేవుడు చేసాడు. యోబు దృష్టిలో దేవుడతన్ని కాలదన్నాడు, ఘనత గౌరవములనుండి తొలగించాడు, బంధించాడు. వాటినన్నింటిని అలా ఎందుకు చేసాడో తెలిసి ఉంటే యోబు భరించేవాడు (19:7–9).

## ముగింపు

ఈ భాగమునుండి మనం పలు పాఠాలను తీసికొనవచ్చు.

వృద్ధి దేవుని అంగీకారమని కాని, దుర్దశ దేవుని తృణీకారమని కాని తలంచరాదు (21:7–26). దేవుని సహజ స్వభావాన్ననుసరించి ఎవరైనా బాధలను పొందవచ్చు. ఎవరైనా వృద్ధి చెందవచ్చు.

రెండవది, న్యాయం ఎదో ఒక దినాన లెక్క చెప్పమని కోరుతుంది. ఆ సమయంలో అది విదితం కాకపోయినా అది వాస్తవమే. నీతిమంతులకంటె దుష్టులు క్షేమం పొందినట్టున్నా, అంతములో దుష్టులు దేవుని న్యాయాన్ని ఎదుర్కొంటారని యోబు తీర్మానిస్తుంది (21:17–30). ఈ జీవిత కాలంలోనే దేవుడు లెక్కలన్నిటిని ముగించడు. వాటిని ఎలా కుదర్చాలో ఆయనకు బాగా తెలుసు – గనుక లెక్కలు సరిపెట్టబడునట్టు ఆయనయందు నమ్మికయుంచు (రోమా 12:17–21). దుష్టులు మార్పునొంది తిరిగి రావాలనే కోర్కెతో దేవుడు దీర్ఘశాంతం వహిస్తున్నాడు (2 పేతురు 3:9; యెహెజ్కేలు 33:11).

మూడవది, కేవలం భూసంబంధమైన తెలివితోనే మానవ సమస్యలను పరిష్కరించాలనే యోబును, యోబు స్నేహితులవంటివారును విస్మయమొందుదురు. యోబుకు అర్థం కాలేదు. తనకు అర్థం కానట్టు తాను ఎరిగాడు. తమకు తెలుసునని అతని స్నేహితులు భావించారు, అయితే వారి గ్రహింపు లోపమయ్యిందని వారు ఎరుగలేక పోయారు. జీవిత పోరాటాలను మానవ జ్ఞానం ద్వారా ఎదుర్కోగలమనుకునే ప్రతి ఒక్కరూ అధిరోహించలేని సమస్యలను ఎదుర్కోవలసియుంటుంది. జ్ఞానయుక్తంగా యిర్మీయా యిలా అంగీకరించాడు: "...తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" (యిర్మీయా 10:23). దేవుని పక్షంగా మాట్లాడుతూ, "నా తలంపులు మీ తలంపుల వంటివి కావు. నా మార్గములు మీ మార్గముల వంటివి కావు" అని యెషయా తెలిపాడు (యెషయా 55:8).

సహించడానికి కష్టంగా ఉండే కొన్ని బాధలను దేవుడు మనపైకి అనుమతిస్తాడు. అయితే అవి నిత్యత్వములో క్షేమంకొరకు పనిచేస్తాయి (రోమా 8:28). మన జీవితాలను నాశనం చేసినట్టు దేవుని నిందించకూడదు. ఆయన మన ఆత్మలను రక్షింపగోరతాడు. ఆయన నిత్య జీవాన్ని గూర్చి ఆలోచించినట్టు భూసంబంధమైన జీవితాన్ని గూర్చి ఆయన పట్టించుకోడు. మన దేహంకంటెను మన ఆత్మను గూర్చి ఆయన ఎక్కువ అక్కరగలవాడై యున్నాడు. నరులుగా ఈ ప్రాధాన్యతలను వెనుకకు త్రిప్పి చూస్తాం.

గుడ్డి, చెవిటివారి బాధలు మనకు అక్కర కలిగిస్తూ ఉంటాయి. తన ప్రజలకు యిలాటి కష్టాలు కలిగేలా దేవుడే అనుమతిస్తాడా అని మనం అబ్బురపడతాం. సత్యమేమంటే, వారికి బాధలున్నప్పటికిని, రెండు కన్నులు గలవారికంటెను కొన్నిసార్లు గుడ్డివారు ఎక్కువ గ్రహింపు గలవారైయుంటారు. నిజమైన విలువలను చూచుటకు భౌతికమైన దృష్టి గ్యారంటీ యివ్వదు. కొన్నిసార్లు వినలేనివారు యితర విషయాల్లో అధికులై, భౌతికమైన వినికిడి కలిగియుంటే వారెన్నడు వృద్ధిపొందనంతగా తమ తలాంతులను పెంపార చేసికొంటారు. ఒకటి తక్కువైతే యితర వరాలను సంపాదించు కొనడానికి కృషి ఎక్కువగా జరుగుతుంటుంది.

చివరిగా, నీతిమంతులు గెలుపొందువారైయుంటారు (17:9). వారు ముందుకు సాగి పైకి ఎగయుదురు. హృదయ శుద్ధిగలవారు బలవంతులైయుంటారు.